క్లుప్తంగా

ఘనంగా చర్చి వార్షికోత్సవం


బిషప్‌తో సంఘస్తులు

టేకులపల్లి: సులానగర్ గ్రామంలో మేరీమాత చర్చి మూడో వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఖమ్మం పీఠాధిపతి (బిషప్) సాగిలి ప్రకాశ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళలు, యువతులు, బాలికలు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఫాదర్లు తుంపాటి అగస్టీన్, జయరాజు, జయ నందు, అమృత్, తుడుం యాకోబు, విజయ్, సంఘ పెద్దలు, ఉపదేశులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాలతో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇక నుంచి ప్రతీ సోమవారం అదే హాలులో ఆధార్ నమోదు కేంద్రాన్ని నిర్వహించనున్నారు.

వాహనదారులకు లైసెన్స్‌లు తప్పనిసరి

కొత్తగూడెంటౌన్: లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతూ పట్టుబడిన వారికి లెర్నింగ్ లైసెన్స్‌లను జిల్లా ఇన్‌చార్జ్ ఆర్టీఓ వెంకటరమణ, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై నరేష్ అందజేశారు. సోమవారం కొందరు వాహనదారులు లైసెన్స్ లేకుండా నడుపుతున్న వాహనదారులను తనిఖీల్లో ఎస్సై నరేష్ పట్టుకున్నారు. వారిని నేరుగా ఆర్టీఓ కార్యాలయానికి తీసుకెళ్లి లెర్నింగ్ లైసెన్స్‌లకు దరఖాస్తు చేయించి జిల్లా ఇన్‌చార్జ్ ఆర్టీఓ చేతుల మీదుగా అందజేశారు. మాట్లాడుతూ.. ప్రతీ వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, లేదంటే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులకు లైసెన్స్‌లను ఇప్పించే విషయంలో జిల్లా రవాణాశాఖ, పోలీసులు సమన్వయంతో అర్హత కలిగిన వారికి లైసెన్స్‌లు అందేలా చూస్తామన్నారు.

పాఠశాలల సందర్శన

జూలూరుపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీ, హైస్కూల్, వెంగన్నపాలెం సెయింట్ ఆంటోనియస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలను సోమవారం స్పెషల్ మానిటరింగ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఈఓ వెంకటేశ్వరాచారి సూచనలతో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల రిజిస్టర్లను తనిఖీ చేయడం జరిగిందన్నారు.

మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

ఇల్లెందు: మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలని సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు వీసం రమ కోరారు. సోమవారం ఇల్లెందులోని ఆఫీసర్స్ క్లబ్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... ఉద్యోగుల కుటుంబ సభ్యులకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాట నిర్వహించటం జరుగుతుందని, మహిళలు అత్యధికంగా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్ రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, సేవ సెక్రెటరీ సులక్షణ, ఇతర సేవా సమితి సభ్యులు, ట్రైనర్స్, సింగరేణి స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

విద్యా రంగంలో కేంద్రం గుత్తాధిపత్యం గర్హనీయం

కొత్తగూడెంఅర్బన్: విద్యా రంగంలో కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యం మానుకోవాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు అన్నారు. సోమవారం జేబీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. యూనివర్సిటీలకు రాష్ట్రాలే నిధులు సమకూర్చుకోవాలని చెబుతూ మరోవైపు ఉపకులపతుల నియామకం నుంచి, ప్రవేశాల వరకు కీలకమైన నిర్ణయాల్లో రాష్ట్రాల పాత్రను తొలగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానం కార్పొరేట్, ప్రైవేట్ సంస్థల్ని ప్రోత్సహించేలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్, పూనెమ్ మురళి, బాబీ, బన్ను, శివ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో తాగునీటి సరఫరా

జూలూరుపాడు: అధికారులు మండలంలోని గుండ్లరేవు, రాంపురంతండా, ఎలుకలొడ్డు గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులు చేపట్టడంతో తాగునీటి సమస్య పరిష్కారం అయింది. ఐదేళ్లుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ఆయా గిరిజన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించడం జరిగిందని మిషన్ భగీరథ ఏఈ ఎస్కే యాస్మిన్ సోమవారం తెలిపారు.

ఉత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో శ్రీదుర్గామల్లేశ్వర స్వామి


కొత్తగూడెంటౌన్: గణేష్ టెంపుల్‌లో తలంబ్రాలను కలుపుతున్న మహిళలు

కొత్తగూడెంటౌన్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్‌టెంపుల్)లో సోమవారం శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వారి పంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవం పూజా కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. ఈ వేడుకలు ఫిబ్రవరి 24 నుంచి 28 తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గామల్లేశ్వర స్వామి వారిని పెళ్లికుమారుడిగా, శ్రీగంగాదేవి, స్వర్ణదుర్గ అమ్మవార్లను పెళ్లికుమార్తెలుగా అలంకరించారు. అనంతరం పసుపు కొట్టటం, తలంబ్రాలను కలిపే కార్యక్రమాలను వేదమంత్రోచ్చారణల మధ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం విఘ్నేశ్వరపూజ, రక్షాబంధనం, ధీక్షారాధన, అంకురార్పణం, ధ్వజారోహణం, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

ముస్తాబైన శివాలయం..

పాల్వంచరూరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని సందర్భంగా శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలు, పూలమాలలతో అలంకరించారు. నేటి నుంచి 27వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజులు అభిషేక పూజలు, అష్టోత్తరములు, మహాన్యాస పారాయణం, మూలమంత్ర హోమం, రుద్రహోమం, స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.


పాల్వంచరూరల్: కాశీ విశ్వేశ్వర ఆలయం

శివరాత్రికి ప్రత్యేక బస్సులు..

చుంచుపల్లి: కొత్తగూడెం, పరిసర గ్రామాల ప్రయాణికులకు, భక్తుల సౌకర్యార్థం మహాశివరాత్రి సందర్భంగా 26న నీలాద్రి, అన్నపురెడ్డిపల్లి, బెండాలపాడు దేవస్థానాలకు కొత్తగూడెం బస్టాండ్, చంద్రుగొండ నుంచి ప్రత్యేక బస్సులు నడపబడునని డిపో మేనేజర్ ఎం.దేవేందర్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 7382858008, 7382858258 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన...

సుజాతనగర్: స్థానిక సోమేశ్వరాలయంలో ఈనెల 26న జరగనున్న శివరాత్రి పర్వదినానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పోలీస్‌శాఖ ఏర్పాటు చేస్తున్న భద్రత ఏర్పాట్లను కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... శివరాత్రి రోజున భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేసి త్వరితగతిన దర్శనం అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ పండితులు జనార్థనశర్మ, ఎస్సై ఎం.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


సుజాతనగర్: ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ

విగ్రహ ప్రతిష్ఠ


పూజలో పాల్గొన్న భక్తులు

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం తెలగరామవరం గ్రామంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో సోమవారం అత్యంత వైభవంగా శ్రీ భక్తంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. గ్రామంలో ముత్యాలమ్మ, బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులు జరగనున్న పూజల్లో భాగంగా రెండో రోజు శ్రీ సీతారామస్వామిలకు పంచాభిషేకం, హోమం, భక్తంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

హక్కుల సాధనకు ఐక్యం కావాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: ఆర్థిక, సామాజిక, రాజకీయ హక్కుల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలు ఏకం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగిన దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. దళితుల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులను కేటాయించడంతో పాటు దళితులపై దేశ వ్యాప్తంగా నిత్యం జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత దళితుల సంక్షేమానికి నిధుల్లో కోత విధించడంతో దాడులు పెరిగాయన్నారు. రాజ్యాంగ భద్రత, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, జనాభాకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. దీర్ఘకాలిక సామాజిక ఉద్యమం ద్వారానే దళితులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను సాధించుకోగలుగుతామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, పేద అసైన్డ్ రైతులకు మేలు జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, కె.ఏసురత్నం, మరుపాక అనిల్‌కుమార్, ముత్యాల విశ్వనాథం, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, బండి నాగేశ్వరరావు, రత్నకుమారి, పేరాల శ్రీను, చెన్నయ్య, మామిడాల ధనలక్ష్మి, జకరయ్య, సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలేది ?


సమావేశానికి హాజరైన నాయకులు

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను తుంగలో తొక్కిందని అఖిలపక్షం ఆరోపించింది. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఇల్లెందు అఖిలపక్షం సమావేశమైంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, కె.సారయ్య, అబ్దుల్ నబీ, ఎండీ రాసుద్దీన్, గోపగాని శంకర్ రావు, ముద్రగడ వంశీ మాట్లాడుతూ... త్వరలో బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం ఆందోళన నిర్వహించేందుకు రెండు జిల్లాల వామపక్ష పార్టీల జిల్లాల కార్యదర్శులతో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల వల్ల బయ్యారం ఉక్కు పరిశ్రమ అడ్రస్ లేకుండా పోయిందన్నారు. దీంతో పాటు జిల్లాల విభజనలో మండలాలు, డివిజన్ ఏర్పాటు నిర్లక్ష్యానికి గురవుతోందన్నారు. ఈ సమావేశంలో కృష్ణ, మోహన్ రావు, శంకర్, నాగయ్య, కొమరయ్య, వలీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నిలబెట్టుకోండి..


మాట్లాడుతున్న మధు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీలకే పరిమితం కాకుండా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. స్థానిక మంచికంటి భవన్‌లో సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కోల్‌బెల్ట్ ఏరియాలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు తాము అధికారంలోకి రాగానే వందరోజుల్లో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని హామీలు గుప్పించారని, ఏడాది గడిచినా హామీలను నిలబెట్టుకోవడం లేదని ఎద్దేవా చేశారు. కోలిండియాలో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతూ జీఓలు అమలు చేస్తున్నారని కానీ, తెలంగాణలో మాత్రం వెట్టి చాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో కె.బ్రహ్మాచారి, డి.వీరన్న, రాజయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా యూనిఫామ్ ఇవ్వాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు టెండర్‌లో పేర్కొన్నట్లు నియమ నిబంధనల ప్రకారం ఉచితంగా యూనిఫామ్, బూట్లు, ఇతర పరికరాలు ఇవ్వాలని, వృత్తి పన్ను రద్దు చేయాలని, యూనిఫామ్ పేరుతో అక్రమ వసూళ్ల దందాను నిలిపివేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు కె.డబ్ల్యూ కృష్ణఫర్ డిమాండ్ చేశారు. ప్రకాశం స్టేడియంలో సోమవారం కార్పొరేట్ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. అనంతరం సెక్యూరిటీ జీఎం సీహెచ్ లక్ష్మీనారాయణ, జీఎం పర్సనల్, జీఎం ఎంపీ, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్, కమలాకర్, శ్రీను, సురేష్, అనీల్, మోహన్, రాధాకిరణ్, రవి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవులకు ఒరిగిందేమీ లేదు..


మాట్లాడుతున్న ఏజే రమేష్

పాల్వంచ: బీజేపీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊతమిస్తోందని, కష్టజీవుల ఒరిగిందేమీ లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ అన్నారు. సోమవారం సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మంచికంటి భవన్‌లో సీఐటీయూ పట్టణ కన్వీనర్ కె.సత్య అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ.. బడ్జెట్‌లో వ్యవసాయ కూలీల, రైతాంగానికి ఊరటనిచ్చే పథకాలేవీ లేవన్నారు. వివిధ రూపాల్లో పరోక్ష పన్నులను భారీగా విధించారని విమర్శించారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దొడ్డ రవికుమార్, తులసీరామ్, రహీం నిరంజన్, కాంతి మాధవి, గుర్రం రాములు, కృష్ణవేణి, పద్మ, అమల, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి


మాట్లాడుతున్న హర్యా

టేకులపల్లి: అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, మిరప, వరి తదితర పంటలకు సమగ్ర సర్వే నిర్వహించి ఎకరానికి రూ.50వేల నష్టపరహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం టేకులపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్యా హర్యా, మండల అధ్యక్షుడు ఎట్టి నరసింహారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం టేకులపల్లిలో జరిగిన ముఖ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ... అకాల వర్షంతో మండలంలోని పలు గ్రామాలలో మొక్కజొన్న తోటలు నేలమట్టం అయ్యాయని పేర్కొన్నారు. రూ.లక్షల పెట్టుబడి పెట్టిన రైతులు కన్నీరు కారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్తి వెంకటేశ్వర్లు, డి.ప్రసాద్, బోడ మంగీలాల్, చింత లాలమ్మ, జయరాం, లక్ష్మణ్, సూర్యం, నందా, లాలు, బాదావత్ పూల్ సింగ్, వీసం నాగేందర్, చింత శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకుందాం..


మాట్లాడుతున్న రవి

ఇల్లెందురూరల్: ధన ప్రవాహం, ఆత్మగౌరవం నడుమ సాగుతున్న ఎమ్మెల్సీ పోరులో ఓటర్లు మన స్సాక్షితో తమ ఓటును సద్వినియోపర్చుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. సుభాష్‌నగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఆయన మాట్లాడారు. గతంలో ఆరేళ్లు ఎమ్మెల్సీగా పనిచేసిన చుక్కా రామయ్య నిజాయితీ, నిబద్ధతతో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పనిచేశారని, ఆ తరువాత గెలిచిన వారు అధికార పార్టీతో అంటకాగి సమస్యలను విస్మరించారని ఆరోపించారు. నర్సిరెడ్డి తన ఐదున్నరేళ్ల పదవీకాలంలో మారుమూల ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. తనకు కేటాయించిన సీడీఎఫ్ నిధులను ప్రభుత్వ పాఠశాలలకే కేటాయించారని పేర్కొన్నారు. సీపీఎస్ విధానం తెచ్చింది కేంద్ర ప్రభుత్వమే అయినా దాని రద్దుకు కృషి చేస్తానని బీజేపీ బలపర్చిన అభ్యర్థి ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమన్నారు.

గత ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడామని, అనేక నిర్బంధాలను ఎదుర్కొని ఉపాధ్యాయుల పక్షాన నిలబడ్డామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సమస్యలను పరిష్కరిస్తుందనే నమ్మకం ఉందని, లేకపోతే పోరాటానికి సిద్ధంగా ఉంటామన్నారు. ఎమ్మెల్సీగా నర్సిరెడ్డికి టీపీటీఎఫ్‌తో సహా 19 సంఘాలు మద్దతుగా నిలిచాయని, మొదటి ప్రాధాన్యతా ఓట్లతోనే ఆయన విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు రాజు, పూర్ణచందర్‌రావు, పిల్లి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, కిషోర్‌సింగ్, భాగ్యారావు, మహేష్, సురేందర్, రవికుమార్, జయరాజు, తువుర్యా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మిర్చి కొనుగోళ్లు

టేకులపల్లి: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లి సబ్ యార్డులో ఈనెల 17న ప్రారంభమైన మిర్చి కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రారంభమైన ఏడు రోజుల్లోనే టేకులపల్లి సబ్ యార్డు ఆదరణ పొందింది. మొదటి రోజు మిర్చి క్వింటా రూ.13,300 ధర పలకగా, సోమవారం రూ.14,050 ధర వచ్చింది. దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న ఈ యార్డులో మిర్చి కొనుగోళ్లు జరుగుతుండటం, నాణ్యమైన మిర్చి వస్తుండటంతో ట్రేడర్లు, మెరుగైన ధర లభిస్తుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

పాల్వంచరూరల్: ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్యే ఎన్నికల ఏర్పాట్లను సోమవారం తహసీల్దార్ వివేక్ పర్యవేక్షించారు. స్థానిక బొల్లోరిగూడెంలో పోలింగ్ బూత్‌ను తహసీల్దార్ సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. మాట్లాడుతూ... మొత్తం 249 మంది ఓటర్లు ఉన్నారని వారికోసం 95వ నంబర్ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. తహశీల్దార్ వెంట సీఐ, ఎస్ఐ ఉన్నారు.

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ స్టేషన్ – 89ని సోమవారం జూలూరుపాడు తహసీల్దార్ కె.స్వాతిబిందు సందర్శించారు. తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు, టాయిలెట్స్ సౌకర్యాలను పరిశీలించారు. ఈనెల 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా పోలింగ్ స్టేషన్‌లో సౌకర్యాలను పరిశీలించడం జరిగిందని తహసీల్దార్ స్వాతి బిందు తెలిపారు.

చెరువు ఆక్రమణలను అరికడతాం..

జూలూరుపాడు: చెరువులు, కుంటల ఆక్రమణలను అరికడతామని జూలూరుపాడు ఇరిగేషన్ ఏఈ మీనా అన్నారు. సోమవారం జూలూరుపాడు విప్పజాలకుంట, వెంగన్నపాలెం జమ్మికుంట చెరువులను ఆమె పరిశీలించారు. మాట్లాడుతూ... చెరువులు ఆక్రమణలకు గురైనట్లు ఆరోపణలు రావడంతో పరిశీలించినట్లు చెప్పారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు జాయింట్ సర్వే నిర్వహించి చెరువులు, కుంటలకు సరిహద్దులు గుర్తించడం జరుగుతుందన్నారు.

బీసీ మేనిఫెస్టో ఆవిష్కరణ

ఇల్లెందు: మనమెంతో.. మన వాటా అంత.. నినాదంతో బీసీలు ఉద్యమించాలని బీసీ ఉద్యమ నాయకులు ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. సోమవారం ఇల్లెందులో బీసీ మేనిఫెస్టో పుస్తకావిష్కరణ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద వర్గాల సామాజిక ఉద్యమకారుడిగా ఉపాధ్యాయుడిగా సాంబశివరావు ఎంతో కృషి చేశాడన్నారు. ఆయన 78వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. సామాజిక న్యాయం కార్యాచరణ ప్రణాళిక ప్రకారం బీసీలు సగం బీసీల వాటా సగం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యమ నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వమే తునికాకు సేకరించాలి


ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చుంచుపల్లి: రాష్ట్రంలో అటవీ ప్రాంతాల అంతటా తునికాకు సేకరణకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా తునికాకు యూనిట్లను వేలంపాటలు నిర్వహించడం లేదా సేకరించడం ప్రభుత్వమే చేపట్టాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, అఖిల భారత ఐక్య రైతు సంఘం, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఫారెస్ట్ కార్యాలయంలో ఏఓ కళ్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తునికాకు మోడెం నరికించే పనులు చేపట్టాలని, తద్వారా ఆదివాసీలకు, ఇతర పేదలకు ఉపాధి దొరుకుతుందని, 50 ఆకుల కట్టకు రూ.5 ధర నిర్ణయించాలని, గత బోనస్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. బీమా సౌకర్యం కల్పించాలని, కల్లాల్లో తాగునీరు, వైద్యం అందించాలని, కల్లాల్లో జరిగే పనులకు గతం మీద 25 శాతం అదనంగా రేట్లు పెంచాలని, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి ఉపాధికి బీడీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెచ్చల రంగారెడ్డి, ముద్దా భిక్షం, జాటోత్ కృష్ణ, కల్లూరు కిషోర్, బానోత్ ధర్మ, నకిరికంటి నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

ప్రతీ ఆటోకు 'పోలీస్ స్టేషన్' స్టిక్కర్


ఆటోకు స్టిక్కర్ వేస్తున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఆటోకు పోలీస్ స్టేషన్ వారీగా ప్రత్యేక నంబర్‌తో స్టిక్కర్ వేస్తున్నారు. అంతేకాకుండా అడ్డాల వారీగా ప్రతీ ఆటో సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌లో నమోదు చేస్తున్నారు. ఇల్లెందు (వైఎల్‌డీ) ఏ, బీ, సీ, డీ ఇలా ఒక అక్షరంతో కూడిన సీరియల్ నంబర్ నుంచి నమోదయ్యే స్టిక్కర్లను ఆటోకు ముందు, వెనుక కనపడేలా అంటిస్తున్నారు. ఏ ఆటో ఎక్కిన విషయం గుర్తుంటే ఏదైనా ప్రమాదం జరిగితే ఇట్టే పోలీసులకు సమాచారం చేరవేసే అవకాశం ఉంటుంది. లేదా ఎవరైనా అపరిచితులు ఆటోలో ప్రయాణించినా, ఏదైనా ప్రమాదం జరిగి దొరకుండా వెళ్లినా ఆటో నంబర్‌తో గుర్తించే అవకాశం ఉంటుంది. ఈ సమాచారాన్ని ప్రతీ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేస్తున్నారు. సోమవారం డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐలు సందీప్‌కుమార్, నాగుల్‌మీరాఖాన్, బి.సూర్య 420 ఆటోలకు స్టిక్కర్లు వేశారు. ఇలా ఇల్లెందులో ప్రతీ ఆటోకు స్టిక్కరు వేసి ప్రయాణికుల భద్రతను పెంచారు.

'గూడెం'లో ఆరోగ్య మహాసభలు


మాట్లాడుతున్న ప్రకృతి ఆశ్రమ కమిటీ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మార్చి 23న ప్రకృతి – ఆరోగ్య మహాసభలు నిర్వహించనున్నట్లు ప్రకృతి ఆశ్రమం కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం రామవరం ఎస్సీబీ నగర్‌లోని స్వర్ణభారతి పాఠశాల ఆశ్రమం కోఆర్డినేటర్ సుగుణారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమం గౌరవ అధ్యక్షుడు మొక్కల వెంకటయ్య, గౌరవ సలహాదారు సింగరేణి ఏజీఎం గోనె శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఆశ్రమం ఆధ్వర్యంలో పది సంవత్సరాలుగా యోగా మహాసభలు, మిల్లెట్స్ ఫెస్టివల్, మిల్లెట్స్‌తో వంద రకాల వంటకాలు, ఔషధ మొక్కల ప్రదర్శన, కరోనాపై అవగాహన సదస్సు, డాక్టర్స్ మీట్, యోగా, ప్రకృతి వైద్యంపై సభలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యాభిమానులు, ప్రకృతి ప్రేమికులందరూ ఈ సభలలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఐటీఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్ రాయలింగు, స్వర్ణ భారతి పాఠశాల కరస్పాండెంట్ శైలజ, పిల్లలమర్రి వరప్రసాద్, బిక్కులాల్, దయాసాగర్, శంకర్, కే.రమేష్‌బాబు, సబ్బని రాజేష్, యాకస్వామి పాల్గొన్నారు.